
సాక్షి
సూర్యాపేట
గురువారం : 4 : ఏప్రిల్ : 2024



ఎన్‌కౌంటర్‌కు తొమ్మిదేళ్లు
ఉమ్మడి మోత్కూరు మండలంలోని జానకీపురం గ్రామంలో ఎన్‌కౌంటర్ జరిగి తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. - 8లో



రంజాన్ కిట్ల తయారీ
ముస్లింలకు ప్రభుత్వం తరఫున ఇచ్చే రంజాన్ కిట్లు చౌటుప్పల్‌లోని మారుతీ కోటెక్స్ పరిశ్రమలో తయారవుతున్నాయి. - 10లో



రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-35 (గురువారం సా॥)
సహర్ 4-45 (శుక్రవారం ఉ॥)

ధాన్యం కొనుగోలుకు సిద్ధం


జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం

- 3.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 281 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- త్వరలో మొదలు కానున్న కొనుగోళ్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : యాసంగి ధాన్యం కొనుగోలుకు పౌరసరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. 3.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 281 కేంద్రాలను కూడా ప్రారంభించింది. త్వరలోనే కొనుగోళ్లు మొదలు కానున్నాయి. ఏటా ఈ సీజన్‌లో వర్షాలు కురిసి పంట తడుస్తుండడంతో ప్రభుత్వం ఈ సారి ముందస్తుగా కొనుగోలు కేంద్రాలకు టార్పాలిన్లు సరఫరా చేసే పనిలో పడింది.

281 కేంద్రాలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా 3,82,545 ఎకరాల్లో వరి సాగు చేశారు. వరి కోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. వరి సాగుకు అనుగుణంగా దిగుబడిపై పౌర సరఫరాల శాఖ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. 3,54,896 మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు రానున్నట్లు అంచనా వేసింది. ఇందుకు సంబంధించి మొత్తం 281 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 183, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 85, డీసీఎంఎస్, మెప్మాల ఆధ్వర్యంలో 13 కేంద్రాలు ఉన్నాయి. ఒకవేళ అకాల వర్షాలు వచ్చినా ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో అదనంగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుతున్నారు. కేంద్రాల్లో ఎక్కువ ధాన్యం నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు రవాణా చేసేందుకు వీలుగా సరిపడా వాహనాలను ఏర్పాటు చేశారు. రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్ష్యం చేరడం కష్టమే...?

ఈ సారి ఎండలు మండుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. సాగు చేసిన వరి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ధాన్యం సేకరణ లక్ష్యం తక్కువగానే ఉన్నప్పటికీ టార్గెట్ చేరేలా కనిపించడం లేదు. ఇప్పటికే జిల్లాలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. పంటలు ఎండి పోతుండటంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ట్యాంకర్లతో నీటిని పెడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో సుమారుగా1,500 ఎకరాలకు పైగా వరి ఎండిపోయింది. దీంతో ధాన్యం దిగుబడి తక్కువగా వచ్చే అవకాశాలున్నాయి.

సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ నంబర్ 6281492368

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ప్రారంభించామని ,కొనుగోలులో సమస్యలు తలెత్తితే కంట్రోల్ రూమ్ నంబర్ 6281492368ను సంప్రదించాలని కలెక్టర్ ఎస్. వెంకటరావు సూచించారు. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్ ఏ రకం ప్రతి క్వింటాకు రూ. 2,203, సాధారణ రకానికి రూ. 2,183 పొందాలని కోరారు. వేసవి దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు, హమాలీలకు మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. కేంద్రాల్లో టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమశాతం కొలిచే మిషన్లు అన్నీ సరిపడా ఉన్నాయని పేర్కొన్నారు. గన్నీ బ్యాగులు ప్రస్తుతం 39,33,501 ఉన్నాయని మరో 49,38,899 బ్యాగుల కోసం ఇండెంట్ పెట్టామని త్వరలో వస్తాయని తెలిపారు.

గత రెండు సీజన్లలో కొన్నది కొంతే..

2022–23 యాసంగి, 2023–24 వానాకాలం సీజన్లలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలపై రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎక్కువ శాతం మంది ప్రైవేట్ వ్యాపారుల వైపే మొగ్గు చూపడంతో కొనుగోలు కేంద్రాల లక్ష్యం నెర వేరలేదు. 2022–23 యాసంగిలో జిల్లాలో ధాన్యం సేకరణకు ప్రభుత్వం 271 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. 5.85లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ 3.61లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించింది. ఇక 2023–24 వానాకాలం సీజన్‌లో కూడా అనుకున్న లక్ష్యం చేరలేదు. 4.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య సేకరించాలని టార్గెట్‌గా పెట్టుకొని 240 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 1.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు.

తుక్కుగూడ సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో ఆర్‌డీఆర్, చెవిటి వెంకన్న తదితరులు

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : ఈనెల 6వ తేదీన తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించే బహిరంగ సభను కార్యకర్తలు విజయవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బహిరంగ సభతో రానున్న పార్లమెంటు ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని మొదలు పెడుతుందన్నారు. ఈ సభలోనే ఎన్నికల మేనిఫెస్టోను భావి ప్రధాని రాహుల్ గాంధీ విడుదల చేస్తారని తెలిపారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 50వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 స్థానాలు గెలుస్తుందని, నల్లగొండ పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో చేజిక్కించుకుంటామని తెలిపారు. రైతులకు నీళ్ల అందించే విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, రైతులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, నాయకులు కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వర్ రావు, అంజద్‌అలీ, రమేష్ పాల్గొన్నారు.

తాగడానికి మాత్రమే నీటిని వినియోగించాలి

- కలెక్టర్ వెంకటరావు

పెన్‌పహాడ్: నీటిని తాగడానికి మాత్రమే వినియోగించాలని కలెక్టర్ వెంకటరావు సూచించారు. బుధవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి వద్ద ఎస్‌ఎస్పీ కాల్వను అదనపు ఎస్పీ మేక నాగేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించి మాట్లాడారు. తాగునీటి ఎద్దడి నివారణకు నాగార్జున సాగర్ నుంచి పాలేరు జలాశయం నింపడానికి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. తాగడానికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగించకుండా 24 గంటలు పర్యవేక్షణకు 26టీమ్‌లను ఏర్పాటు చేసి 126మందిని నియమించినట్లు తెలిపారు. ప్రభుత్వం తాగడానికి మాత్రమే నీటిని విడుదల చేసిందని రైతులు బోర్ల ద్వారా వినియోగించవద్దని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మందడి మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లాలోని చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకటరావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత, అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జరిగే డిజిటల్ లావాదేవీలు, బ్యాంక్ లావాదేవీలు, అలాగే పోస్టల్ శాఖ ద్వారా జరిగే లావాదేవీలపై గట్టి నిఘా ఉంచాలన్నారు. పట్టుకున్న నగదు, మద్యం, బంగారం, వెండి, ఇతర వస్తువులకు బాధితులు ఆధారాలు చూపితే గ్రీవెన్స్ కమిటీ పరిశీలన అనంతరం 24 గంటలలోపు అందజేస్తుందన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, ఎక్సైజ్ పర్యవేక్షకుడు లక్ష్మణ్ నాయక్ , డీఎఫ్‌ఓ సతీష్ కుమార్, డీసీఓ పద్మ, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


అన్నారం బ్రిడ్జి వద్ద సాగర్ కాల్వలో నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఏఎస్పీ తదితరులు

మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన పోలింగ్ యంత్రాల మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బిఎస్.లతతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 1500 బ్యాలెట్ యూనిట్లు, 1500 కంట్రోల్ యూనిట్లు, 1680 వీవీ ప్యాట్లు కేటాయించారనారు. వీటిని పార్టీల ప్రతినిధుల సమక్షంలో నియోజకవర్గాలకు కేటాయించామని ఆయన తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 24 వరకు అందరూ దరఖాస్తు చేసుకోవాలని ముఖ్యంగా 85 ఏళ్ల పైబడిన, 40 శాతం అంగవైకల్యం ఉన్న వారికి హోమ్ ఓటింగ్ చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీసీఈఓ అప్పారావు, డీఎఫ్ఓ సతీష్ కుమార్, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, సూర్యాపేట ఆర్‌డీఓ వేణు మాధవ్, కోదాడ ఆర్‌డీఓ సూర్య నారాయణ, హుజూర్‌నగర్ ఆర్‌డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : డీఎస్సీ, గ్రూప్స్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు తదితర పోటీ పరీక్షలకు జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీకులాల అభివృద్ధి అధికారి లత, స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్.రాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీన జిల్లా కేందరలోని ఎస్వీ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల నుంచి స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని, వివరాలకు సెల్ నంబర్ 9989129935లో సంప్రదించాలని కోరారు.

నేడు ఫణిగిరికి పురావస్తు శాఖ అధికారుల రాక

నాగారం : నాగారం మండల పరిధిలోని ఫణిగిరి బౌద్ధక్షేత్రానికి గురువారం తెలంగాణ రాష్ట్ర పురావస్తుశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీమతి శైలజారామయ్యర్, డైరెక్టర్ భారతీ హోలికేరి రానున్నట్లు ఆ శాఖ ఏడీ మల్లు నాయక్ తెలిపారు. 2023–2024 ఫీల్డ్ సీజన్‌లో ఫణిగిరి బౌద్ధ క్షేత్రం వద్ద జరుపుతున్న తవ్వకాల్లో బయటపడిన వస్తువుల వివరాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలి


రైతులతో మాట్లాడుతున్న అజ్మీరారాజ్

తిరుమలగిరి (తుంగతుర్తి): రైతులు నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని డీడీఎం అజ్మీరారాజ్ సూచించారు. బుధవారం తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. తేమ 17 శాతం లోపు ఉండేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శ్రీధర్, సూపర్‌వైజర్ అల్తాఫ్, సిబ్బంది రాంరెడ్డి, కమీషన్‌దారులు సామ ఆంజనేయులు, సుధాకర్, రాపాక సోమేష్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రిక్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు కొనసాగాయి. వేకువజామున స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాత సేవ చేపట్టారు. అర్చన, అభిషేకం చేశారు. ఇక ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

స్పెషల్ ఆఫీసర్‌గా అనితా రామచంద్రన్



నల్లగొండ : తాగునీటి సరఫరా పరిస్థితుల పర్యవేక్షణకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రత్యేకాధికారిగా పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనితా రామచంద్రన్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఉమ్మడి జిల్లా పరిధిలోని గ్రామాలు, పట్టణాలు నీటి వనరులు, నీటి సరఫరా తీరు, ఎదురవుతున్న ఇబ్బందులును తెలుసుకుని.. ప్రజలకు ఎప్పటికప్పుడు తాగు నీరు అందేలా చర్యలు తీసుకోనున్నారు. కలెక్టర్లు, రాష్ట్ర స్థాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ.. నీటి సరఫరాకు సంబంధించిన పనులను వెంటనే పూర్తి చేసేలా చూడనున్నారు.

నల్లగొండపై కాషాయ జెండా ఎగరాలి


మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

- అలవికాని హామీలతో కాంగ్రెస్ మోసం చేసింది
- సీఎం కుర్చీ కబ్జా చేసేది మంత్రులే
- విజయసంకల్ప మహా సమ్మేళనంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : గల్లీలో ఏది ఉన్నా ఢిల్లీలో మోదీ ప్రభుత్వం ఉండాలని ప్రజలంతా భావిస్తున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన బీజేపీ నల్లగొండ పార్లమెంట్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప మహా సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం మోదీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు చెప్పిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎవరూ కూల్చాల్సిన పనిలేదని, రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీని కబ్జా చేసేందుకు చూస్తున్నది వారి మంత్రులే అని అన్నారు.
12 ఎంపీ స్థానాలు గెలుపొంది తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ ట్యాక్స్ ప్రారంభమైందని, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఏఐసీసీకి డబ్బులు వెళ్తున్నాయనే చర్చ జరుగుతుందన్నారు. ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మూడు కుటుంబాలే రాజకీయాలు ఏలుతున్నాయని, తనను గెలిపించి వారసత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నూకల నరసింహారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, బండారు ప్రసాద్, కంకణాల నివేదిత, శ్రీలతారెడ్డి, లాలూనాయక్, రావెళ్ల కాశమ్మ, పోతెపాక సాంబయ్య, గడ్డం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఇన్‌చార్జి అసహనం

నల్లగొండ పార్లమెంట్ బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో పాల్గొన్న తెలంగాణ బీజేపీ ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్ ఆ పార్టీ నాయకులకు ప్రశ్నల వర్షం కురిపించారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్ని బూత్‌లు ఉన్నాయి, ఎంత మంది బూత్ అధ్యక్షులు వచ్చారు.. చేతులు పైకి లేపండి అని పదే, పదే అన్నా కొందరు మాత్రమే చేతులు లేపారు. అసెంబ్లీ పరిధిలో 284 బూత్‌లు ఉంటే 80 మంది కూడా హాజరు కాలేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇతర నియోజకవర్గాల నుంచి కూడా ఇదే పరిస్థితి ఉండడంతో.. ఇలా అయితే బూత్ స్థాయిలో ఎలా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ కోఆర్డినేటర్ల నియామకం

నల్లగొండ : అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్లను నియమించింది. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు 12 మందిని నియమిస్తూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవరకొండ – కె.మంజులారెడ్డి, సాగర్ – మహేందర్‌రెడ్డి, మిర్యాలగూడ – నల్ల నరేష్‌కుమార్, హుజూర్‌నగర్ – రేణుక, కోదాడ – అల్లం ప్రభాకర్‌రెడ్డి, సూర్యాపేట – కొల్లూరు పుష్పలీల, నల్లగొండ – నిరంజన్ రెడ్డి, మునుగోడు – వజ్జ సంధ్యారెడ్డి, భువనగిరి – శిరీష్‌రెడ్డి, నకిరేకల్ – దుడం వెంకటరమణ, తుంగతుర్తి – ఆర్.బాలలక్ష్మిని నియమించింది. వీరంతా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పేర్కొంది.

ప్రశ్నించే గొంతుకను గెలిపించండి

- మాజీ మంత్రి హరీశ్‌రావు


ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

భువనగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి పని చేయించాలంటే లోక్‌సభ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం భువనగిరిలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి, అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్‌ఎస్ తరఫున తాము ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశామన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లోనూ గళం వినిపించాలంటే బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని కోరారు.

సమన్వయంతో పని చేయాలి : జగదీశ్‌రెడ్డి

పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కోరారు. ప్రభుత్వానికి ప్రజా సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 110 రోజులు అవుతున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రభాగంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పంటలు ఎండిపోతుంటే రైతులను ఆదుకోవాలన్న సోయి కూడా ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. 12వ విడత రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేసే క్రమంలో కాంగ్రెస్ పార్టీ అడ్డుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రైతుల ఆత్మహత్యలు, విద్యుత్ కోతలు మొదలైనట్లు చెప్పారు.

మళ్లీ మోసపోవద్దు : మాజీ ఎమ్మెల్యేలు

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోయారని, లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ మోసపోవద్దని ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్యగౌడ్, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మళ్లీ రైతు రాజ్యం రావాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలవాలన్నారు. ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. అంతకుముందు కళాకారుల ఆటపాటలు అలరించాయి. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, చెరుకు సుధాకర్, పాల్వాయి రజనీ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జడల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, భువనగిరి పట్టణ, మండల కమిటీల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, పీఏసీఎస్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

రాష్ట్రాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే : క్యామ మల్లేష్

తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ పేర్కొన్నారు. పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవులను అమ్ముకుందని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు.

మళ్లీ వయోజన విద్య

- ఎన్‌ఐఎల్‌పీ పేరుతో నూతన కార్యక్రమం
- నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహణ
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత నుంచి అమలుకు సన్నాహాలు

హుజూర్‌నగర్ : వయోజనులైన నిరక్షరాస్యుల్లో అక్షర కాంతులు నింపేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఎన్‌ఐఎల్‌పీ(న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం) పేరుతో మళ్లీ వయోజన విద్యా కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత విద్యాశాఖ సమన్వయంతో అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

ఏర్పాట్లు పూర్తి

వయోజన విద్య కార్యక్రమ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలని నిర్ణయించాయి. ఈ మేరకు వయోజన విద్య, విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు రావడంతో కార్యాచరణ రూపొందించారు. గతంలో కలెక్టర్‌తో పాటు వయోజనవిద్య డిప్యూటీ డైరెక్టర్‌కు చెక్ పవర్ ఉండగా ప్రస్తుతం కలెక్టర్, డీఈఓ పేరున బ్యాంక్ ఖాతాలు తెరిచేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.


వయోజన విద్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వలంటీర్లతో బోధన

న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం ద్వారా 15 నుంచి 50 ఏళ్లలోపు నిరక్షరాస్యులను అక్షరాస్యులు చేయనున్నారు. స్వయంసహాయ సంఘాల సభ్యులకు చదువు నేర్పనున్నారు. గతంలో సాక్షర భారత్ పథకం కింద సమన్వయకర్తలు చదువు చెప్పేవారు. కొత్తగా చేపట్టే ఈ కార్యక్రమంలో వలంటీర్లను నియస్తారు. వీరికి శిక్షణ, సామగ్రిని అందించనున్నారు. 2027 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

జిల్లాలో 1,29,883 మంది నిరక్షరాస్యులు

జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం మొత్తం 1,29,883 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో ఈ ఏడాది 27,668 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఆదేశాలు అమలు చేస్తాం



“ నవభారత్ సాక్షరత కార్యక్రమానికి సంబంధించి ఆదేశాలు వచ్చాయి. ఇంతలో ఎన్నికల కోడ్ వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొదటి విడతలో 15 నుంచి 30 ఏళ్లలోపు వారికి చదువు చెబుతారు.
– నర్సింహారెడ్డి, ఏపీఓ, వయోజన విద్య, ఉమ్మడి నల్లగొండ

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

చివ్వెంల(సూర్యాపేట): తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుడకుడ గ్రామానికి చెందిన గీత కార్మికుడు బూర సోమయ్య(44) రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు గ్రామ పరిధిలో తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడ్డాడు. చుట్టుపక్కల రైతులు గమనించి చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలుపడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి. వెంకట్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నాగార్జునసాగర్: మద్యానికి బానిసైన యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని అంటించుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన బొల్లెపల్లి హరీష్‌రాజు(23) అవివాహితుడు. అతడి తల్లి హైదరాబాద్‌లో ఉంటూ అక్కడే పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. హరీష్‌రాజు ఒక్కడే హిల్‌కాలనీలో నివాసముంటున్నాడు. మద్యానికి బానిసైన అతడు శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చి, అతడిని స్థానిక కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్యాంకు ఖాతాలోని నగదు మాయం

కోదాడరూరల్: కోదాడ పట్టణానికి చెందిన కల్వగిరి వెంకటేశ్వర్లు బ్యాంకు ఖాతా నుంచి అతడి ప్రమేయం లేకుండానే రూ.71664 కట్ అయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వగిరి వెంకటేశ్వర్లుకు మొబైల్‌కు బుధవారం గుర్తుతెలియని నంబర్ నుంచి ఓటీపీ వచ్చింది. ఆ ఓటీపీని అతడు ఎంటర్ చేయకుండానే అతడి బ్యాంకు ఖాతాలోని రూ.46,993 నగదు కట్ అయ్యాయి. ఆ తర్వాత మరోసారి రూ.4091, రూ.20,900 కట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో అతడు వెంటనే బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చి తాను వాడుతున్న యాక్సిస్ బ్యాంకు డెబిట్ కార్డును బ్లాక్ చేయించాడు. సైబర్ క్రైం పోలీసులకు, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

హత్య కేసులో మహిళ రిమాండ్

భువనగిరి క్రైం: హత్య కేసులో మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు భువనగిరి రూరల్ ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం వడపర్తి గ్రామానికి చెందిన ఎలిమినేటి పద్మారెడ్డిని అదే గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్య, అతడి భార్య వీరామణి, కుమారులు బాలమల్లేష్, గోపికృష్ణ కలిసి మార్చి 19న కొట్టడంతో పద్మారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. పద్మారెడ్డిని హైదరాబాద్‌లోని హాస్పిటల్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఈ నెల 3వ తేదీన మృతిచెందాడు. కాగా ఈ కేసులో మేడబోయిన సత్తయ్య, అతడి కుమారులు బాలమల్లేష్, గోపికృష్ణను ఇప్పటికే రిమాండ్‌కు తరలించగా.. సత్తయ్య భార్య వీరమణిని బుధవారం అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

జానకీపురం ఎన్‌కౌంటర్‌కు తొమ్మిదేళ్లు

- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఘటన



సిద్ధయ్య, ఎస్‌ఐ (ఫైల్)



నాగరాజు, కానిస్టేబుల్ (ఫైల్)





ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన సిమీ ఉగ్రవాదులు (ఫైల్)

మోత్కూరు: ఉమ్మడి మోత్కూరు మండలంలోని జానకీపురం గ్రామంలో ఎన్‌కౌంటర్ జరిగి గురువారంతో తొమ్మిదేళ్లు పూర్తయ్యాయి. 2015 ఏప్రిల్ 4న జానకీపురం గ్రామ శివారులో ఇద్దరు సిమీ ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఆత్మకూరు (ఎం) ఎస్‌ఐ సిద్ధయ్యతో పాటు అదే పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ చౌగోని నాగరాజు అమరులయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న అప్పటి రామన్నపేట సీఐ ఎ. బాలగంగిరెడ్డి, పోలీస్ సిబ్బందికి ఉగ్రవాదులకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో సీఐ బాలగంగిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీస్ సిబ్బంది జరిపిన కాల్పుల్లో ఇద్దరు సిమీ ఉగ్రవాదులు మహ్మద్ అజీజ్, మహ్మద్ అస్లామ్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్ అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఎన్‌కౌంటర్ ముందు రోజు సూర్యాపేట బస్టాండ్‌లో ఉగ్రవాదులు పోలీసులపై కాల్పులు జరిపి పరారయ్యారు. వారి కోసం పోలీస్ యంత్రాంగం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టింది. ఉగ్రవాదులు అర్వపల్లి దర్గా ప్రాంతంలో తలదాచుకొని తిరుమలగిరి మీదుగా మోత్కూరు మండలం చిర్రగూడూరు నుంచి డొంక మార్గం గుండా వెళ్తూ దారితప్పి జానకీపురం గ్రామ శివారుకు చేరుకున్నారు. పోలీసుల నుంచి తప్పించుకోవడానికి బైక్‌పై వెళ్లగా బైక్ వాగులోని ఇసుకలో కూరుకపోవడంతో మరో బైక్ తీసుకొని గ్రామ శివారులోకి ప్రవేశిస్తుండగా ఎదురుగా వచ్చిన పోలీస్ వాహనంపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో డ్రైవర్ సీటులో ఉన్న కానిస్టేబుల్ నాగరాజు అక్కడికక్కడే మృతిచెందగా, ఎస్‌ఐ సిద్ధయ్య పొట్ట, తలలోకి తూటాలు దిగడంతో కుప్ప కూలిపోయాడు. వారిని హుటాహుటిన హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రెండు రోజుల అనంతరం ఎస్‌ఐ సిద్ధయ్య మృతిచెందాడు. అప్పట్లో జానకీపురం ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను పోలీసులు మట్టుబెట్టడంతో దేశంలో ఈ సంఘటన సంచలనాత్మకంగా మారింది.

దేవాలయాల్లో చోరీలు.. దొంగ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ చందనాదీప్తి



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపుతున్న ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం: దేవాలయాలే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ చందనాదీప్తి విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని గొల్లగూడకు చెందిన కమ్మంపాటి బుచ్చయ్య స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ రాత్రి సమయంలో నల్లగొండ, చండూరు, మునుగోడు మండలాల్లో ఉన్న దేవాలయాల్లో చోరీలకు పాల్పడేవాడు. చోరీ చేసిన వస్తువులను గొల్లగూడకు చెందిన స్వర్ణకారుడు కూరెళ్ల సత్యనారాయణకు విక్రయించేవాడు. కాగా బుచ్చయ్య చండూరు మీదుగా హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా.. వాహనాల తనిఖీల్లో భాగంగా కస్తాల క్రాస్ రోడ్డు వద్ద చండూరు ఎస్‌ఐ సురేష్ అతడిని ఆపి దేవాలయాల్లో చోరీ చేసిన శఠగోపాలు, కిరీటాలు, 3.462కిలోల వెండి ఆభరణాలు, 4 గ్రాముల బంగారం, ర.41వేల నగదు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా చండూరు మండలంలోని సంతాన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో, ఉడతలపల్లి కోదండరామస్వామి ఆలయంలో, తేరట్‌పల్లి చెన్నకేశవస్వామి గుడిలో, మునుగోడులోని కనకదుర్గమ్మ గుడిలో, నల్లగొండ పట్టణంలోని గంధంవారిగూడెంలో గల కనకదుర్గమ్మ గుడిలో, కతాల్‌గూడలోని ఆంజనేయస్వామి గుడిలో చోరీలు చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. బుచ్చయ్యతో పాటు చోరీ చేసిన వస్తువులను కొనుగోలు చేసిన స్వర్ణకారుడు కూరెళ్ల సత్యనారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదనలో కీలకంగా వ్యవహరించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, చండూరు సీఐ వెంకటయ్య, సీసీఎస్ సీఐ మహాలక్ష్మయ్య, చండూరు ఎస్‌ఐ సురేష్‌ను ఎస్పీ అభినందించారు.

రాజ్యాంగ హక్కులను కేంద్రం కాలరాస్తోంది

- జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

నల్లగొండ రూరల్: రాజ్యాంగ హక్కులను కేంద్రం కాలరాస్తోందని జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు అన్నారు. బుధవారం రాజ్యాంగ రక్షణ యాత్ర నల్లగొండ పట్టణానికి చేరుకున్న సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో రాజ్యాంగంలోని మౌలిక సూత్రాల పునాదులు ధ్వంసమవుతున్నాయన్నారు. దేశంలోని ప్రజలు జీవించే హక్కు, మాట్లాడే స్వేచ్ఛను కోల్పోతున్నారన్నారు. కులాలు, మతాల పేరుతో మనుషులను విడదీసి పాలిస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతుందని ఆరోపించారు. ఎన్ఆర్‌సీ, సీఏఏ పేరుతో దేశ పౌరుల్లో అభద్రతా భావం పెరిగిందన్నారు. దళితుల అస్తిత్వాన్ని దెబ్బతీసి వారిని ఈ దేశంలో ఒంటరిగా చేసే కుట్ర జరుగుతుందన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి బాస్కర్, జైభీం సైనికల్‌దళ్ కన్వీనర్ పురుషోత్తం, రాజు, సత్యనారాయణ, విజయ్, యాదగిరి, మురళి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండకు చేరుకున్న రాజ్యాంగ రక్షణ యాత్ర

కొండమల్లేపల్లికి చేరిన రాజ్యాంగ రక్షణ యాత్ర..

కొండమల్లేపల్లి : మాలమహానాడు ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న మహబూబ్‌నగర్‌లో చేపట్టిన రాజ్యాంగ రక్షణ యాత్ర బుధవారం కొండమల్లేపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, రాష్ట్ర నాయకుడు పురుషోత్తం పూలమాలలు వేశారు. రాజ్యాంగ రక్షణ యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గోలి సైదులు, జిల్లా నాయకులు యేకుల సురేష్, మేడ సైదులు, పెరుమాళ్ల హరి, చలిచీమల పర్వతాలు, రెడ్డిమళ్ల శ్రీను, రెడ్డమళ్ల రవి, నూనె ప్రసన్న, సంజీవ, జాగటి శ్రీను, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైక్‌లు చోరీ

భువనగిరి క్రైం: ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లను గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేశారు. వివరాలు.. భువనగిరి పట్టణంలోని ఆర్‌బీ నగర్‌లో నివాసముంటున్న దేవరకొండ అజయ్ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేయగా.. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అదే బైక్‌పై వెళ్తూ హౌజింగ్ బోర్డులో నివాసముంటున్న పడమటి జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను కూడా అపహరించారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. బాధితులు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నారు.

చోరీ చేస్తూ పట్టుబడిన యువకుడు

చౌటుప్పల్: మహిళ వద్ద బ్యాగును చోరీ చేస్తున్న యువకుడికి పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ తర్వాత పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బంగారిగడ్డ రోడ్డులో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారుగా 25 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు బంగారిగడ్డ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. ఎవరు పిలిచినా పలకకపోవడం, వింత చూపులు చూస్తుండడంతో స్థానికులు చిన్నపిల్లలను ఎత్తుకెళ్లేందుకు వచ్చాడని భావించారు. అంతలోనే అటుగా వెళ్తున్న ఓ మహిళ వద్ద బ్యాగును లాక్కొని పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఇంతలో స్థానికులంతా కలిసి అతడిని పట్టుకున్నారు. అతడిని వివరాలు అడిగే ప్రయత్నం చేసినా నోరు విప్పలేదు. దీంతో దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తన పేరు బిట్టు అని, ఒడిశాకు చెందిన వాడిని అని మాత్రమే పోలీసులకు చెప్పాడు. సదరు యువకుడు మద్యం మత్తులో అలా చేశాడా, లేదంటే మతిస్థిమితం సరిగా లేకనా అనే విషయాన్ని పోలీసులు విచారిస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



లచ్చయ్య (ఫైల్)

కొండమల్లేపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం శాఖాజిపురం గ్రామానికి చెందిన శిరమోయిన లచ్చయ్య(65) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న లచ్చయ్య మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా దర్శిలో ఆయుర్వేద మందులు తెచ్చుకోవడానికి వెళ్లాడు. తిరిగి ఆర్టీసీ బస్సులో సొంతూరుకు వస్తుండగా.. ఆర్టీసీ బస్సు డ్రైవర్ భోజనం కోసం కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి సమీపంలోని దాబా వద్ద బస్సును ఆపాడు. ఈ క్రమంలో బస్సులో నుంచి దిగిన లచ్చయ్య మూత్రవిసర్జన కోసం రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి బొగ్గు లోడుతో జడ్చర్లకు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో లచ్చయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు. మృతునికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆటోను ఢీకొట్టిన ఘటనలో మరొకరు..

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డు వివేరా హోటల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం పాపయ్యకుంట తండాకు చెందిన లకావత్ గంగు (60), కేతావత్ మహేష్, భుక్య నర్సింహ కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి సొంతూరుకు పయనమయ్యారు. ఈ క్రమంలో భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డు వివేరా హోటల్ సమీపంలో టైల్స్ లోడ్‌తో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కారుతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ నర్సింహతో పాటు కారులో వెళ్తున్న వీరి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ లకావత్ గంగు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి పట్టణ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

నకిరేకల్: నకిరేకల్ మండలం నెల్లిబండ శివారులో 365వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామానికి చెందిన పసల సైదులు(40) సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. రోజుమాదిరిగానే మంగళవారం తన విధులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్ర వావనంపై బయల్దేరాడు. మార్గమధ్యలో నకిరేకల్ మండలం నెల్లిబండ శివారులో 365వ నంబర్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వావనం సైదులు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని అంబులెన్స్‌లో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి పలస సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపారు.

ఫైర్ సర్వీస్‌లో డ్రైవర్ ఆపరేటర్లుగా ఎంపికైన లారీ డ్రైవర్లు



షేక్ లతీఫ్



మదిర శ్రీనివాస్‌రెడ్డి

హుజూర్‌నగర్ రూరల్ : తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం ప్రకటించిన ఫైర్ సర్వీస్‌లో డ్రైవర్ ఆపరేటర్ (ఏఎస్‌ఐ) ఫలితాల్లో హుజూర్‌నగర్ మండలానికి చెందిన ఇద్దరు లారీ డ్రైవర్లు ఎంపికయ్యారు. హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన షేక్ లతీఫ్ 5వ జోన్‌లో మొదటి ర్యాంక్, మదిర శ్రీనివాస్‌రెడ్డి 5వ జోన్‌లో ఐదో ర్యాంక్ సాధించి ఫైర్ సర్వీస్‌లో డ్రైవర్ ఆపరేటర్(ఏఎస్‌ఐ)గా ఎంపికయ్యారు. వీరిద్దరూ చిన్నతనం నుంచి మంచి మిత్రులు. గత 6 సంవత్సరాలుగా లారీ డ్రైవర్లుగా పనిచేస్తూ సమయం దొరికినప్పుడు చదువుకునేవారు. హైదరాబాద్‌లో కోచింగ్ కూడా తీసుకున్నారు. లతీఫ్‌కు ఓపెన్‌లో 10వ తరగతి పూర్తిచేయగా.. శ్రీనివాస్ ఇంటర్ పూర్తి చేశాడు.

గొర్రెలమంద పైకి దూసుకెళ్లిన లారీ

- ఒక గొర్రె మృతి
- గొర్రెల కాపరికి తీవ్ర గాయాలు

గుండాల: లారీ అదుపుతప్పి గొర్రెలమంద పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒక గొర్రె మృతిచెందగా.. గొర్రెల కాపరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గుండాల మండలంలోని పాచిల్ల గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. పాచిల్ల గ్రామానికి చెందిన ఎలగందుల సైదులు గొర్రెలను తోలుకొని మోత్కూరు–గుండాల ప్రధాన రహదారి మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా మోత్కూరు నుంచి ధాన్యం లోడుతో వస్తున్న లారీ (ఏపీ 20 యూ 9396) గొర్రెలమంద పైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఒక గొర్రె మృతిచెందగా.. సైదులు కాలు పైనుంచి లారీ వెళ్లడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

పెద్దఅడిశర్లపల్లి : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని నేనావత్ తండాలో మంగళవారం రాత్రి జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. నేనావత్‌తండాకు చెందిన నేనావత్ రవీందర్(24) మంగళవారం రాత్రి ఇంట్లో స్నానం చేసిన తర్వాత దండెం పై బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పరామర్శించారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

కట్టంగూర్ : ఏ పని చేయడం లేదని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలంలోని కురుమర్తి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కురుమర్తి గ్రామానికి చెందిన గుండగోని హరికృష్ణ(25) మద్యానికి బానిసై ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో విసుగు చెందిన అతడి తల్లి లక్ష్మమ్మ ఏదైనా పని చూసుకోమని హరికృష్ణను మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన హరికృష్ణ మంగళవారం రాత్రి చెర్వన్నారం శివారులో ఉన్న స్మారక స్థూపానికి తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లిన రైతులు హరికృష్ణ స్థూపానికి వేలాడటాన్ని గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ అఫ్జల్ తెలిపారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నల్లగొండ టౌన్ : పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే వారికి వేతనాలు బకాయిలు ఉన్నాయన్నారు. పని ప్రదేశంలో మంచినీటితో పాటు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, సీహెచ్.లక్ష్మీనారాయణ, పి.నర్సిరెడ్డి పాల్గొన్నారు.

చోరీ చేసిన మహిళ పోలీసుల అదుపులో..

నేలకొండపల్లి: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ వద్ద నుంచి బంగారం చోరీ చేసిన నిందితురాలిని స్థానిక పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన శెట్టి కమలమ్మ గత నెల 22న ఆర్టీసీ బస్సులో కోదాడ నుంచి ఖమ్మం వెళ్లింది. ఆమె పక్కనే మరో ప్రయాణికురాలు కూర్చుంది. టికెట్ కోసం ఆధార్‌కార్డును తీసి, బంగారం ఉన్న చిన్నపర్సును చేతితో పట్టుకుని, టికెట్ తీసుకున్నాక పర్సును బ్యాగులో పెట్టింది. నేలకొండపల్లిలో మహిళ దిగిన తరువాత అనుమానంతో కమలమ్మ బ్యాగు చూసుకుంది. అందులో పర్స్ ఉంది కానీ, బంగారం కనిపించలేదు. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితురాలిని గుర్తించారు. బుధవారం రాత్రి ఏపీకి చెందిన సదరు మహిళను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

■ ద్వారకాఎంటర్‌ప్రైజెస్‌ఃపేపర్ ప్లేట్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడిపదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1454]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185016]

■ శ్రీ లక్ష్మీహోంకేర్ః హైదరాబాద్ నందు వృద్ధులకు పేషెంట్లకు సేవ చేయుటకు బేబికేర్ ఇంటి/ వంట పనికి స్త్రీ/పు కా।। జీతంః 17000/- రూం+ మీల్స్ ఫ్రీ. 9847148051 [G-1461]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులనుపేషెంట్స్‌ను చూసుకొనుటకువర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+ భోజనం. జీః 18K. Ph: 9640258899/ 9640468899 [H-799859]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
వివరాలకు
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వడదెబ్బ నుంచి పశుసంరక్షణ ఇలా..

- గుర్రంపోడు పశువైద్యాధికారి అశోక్‌కుమార్ సూచనలు



అశోక్‌కుమార్ పశువైద్యాధికారి



పాడి గేదెను చల్లని నీటితో కడ్డుగుతున్న మహిళా రైతు

పాడి పంట

గుర్రంపోడు : వేసవిలో మనుషులే కాదు పశువులూ వడదెబ్బకు గురవుతాయి. నిర్లక్ష్యం చేస్తే పశువులు వడదెబ్బకు గురై మరణించే ప్రమాదం ఉంది. వడదెబ్బ నివారణ గురించి పశువైద్యాధికారి అశోక్‌కుమార్ రైతులకు అందిస్తున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే....ఉష్ణోగ్రత పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పశువులు షెడ్లలో ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసి ఉండటం, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం, వడగాల్పుల తాకిడికి వడదెబ్బకు గురవుతాయి. తెల్లజాతి కంటె నల్లజాతి పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి

వడదెబ్బ ప్రాణాంతకమే...

వేసవి కాలంలో బయటి ఉష్ణోగ్రత. పశువుల శరీర ఉష్ణోగ్రత కంటె ఎక్కువైనప్పుడు మెదడులోని హైపోథాలమస్ స్వేద గ్రంథులపై నియంత్రణ కోల్పోతుంది. దీంతో చర్మంపై గల స్వేద రంధ్రాలు చెమటను అధికంగా విడుదల చేసి శరీరంలోని ఎలక్ట్రోలైట్‌లను కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడి వేగం పెరుగుతాయి. మూత్ర పిండాలు సరిగా పనిచేయకపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతాయి. శ్వాస ఆడక మరణిస్తాయి.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల ఫారన్‌హీట్ కంటె ఎక్కువగా ఉంటుంది. చర్మ సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. పశువులు సరిగ్గా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి.నీడ కోసం చెట్ల క్రిందకు చేరుతాయి. అధిక దాహం ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత 104 ఫారన్‌హీట్ దాటితే శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఫిట్స్ లక్షణాలతో క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. శరీర ఉష్ణోగ్రత 109 డిగ్రీలు దాటితే ప్రాణపాయం సంభవిస్తుంది. వడదెబ్బ ప్రభావం వల్ల చూలు పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువుల్లో పునురుత్పత్తి ప్రక్రియ కుంటుపడుతుంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి బాగా తగ్గిపోతుంది.

వడదెబ్బ నివారణకు ముందస్తు చర్యలు

వేసవిలో ముఖ్యంగా పశువులను పగటి వేళలె మేతకు వదలరాదు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు పంపాలి. తాగునీరు అన్నివేళలా అందుబాటులో ఉంచాలి. పశువులను రోజుకు కనీసం రెండు సార్లు చల్లని నీళ్లతో కడగాలి. చెరువులు, కుంటల్లో ఈద నివ్వాలి.గాలి వెలుతురు ప్రసారమయ్యేలా ఎత్తైన కొట్టాలను గడ్డితో నిర్మించాలి. రేకులు ఉంటే మధ్యాహ్నం వేళల్లో వరిగడ్డి పరిచి మధ్యాహ్నం వేళల్లో నీరు చల్లాలి. వేసవిలో దాహంతో ఉన్న పశువులు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలి.షెడ్డు పైన వరిగడ్డివేసి మధ్యాహ్నం వేళల్లో నీరివ్వాలి.షెడ్డుల నిర్మాణం తూర్పు, పడమర దిశలలోనే జరగాలి. దీనివల్ల వడగాల్పుల నుంచి తూర్పు, పడమర ఎండల నుంచి రక్షణ లభిస్తుంది. పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం పాలు పితికేటప్పుడు పొదుగును చల్లని నీటిలో కడగాలి.పశువులకు గోమర్లు లేకుండా చూసుకోవాలి. పరిశుభ్రమైన నీరు ఎల్లవేళలో అందుబాటులో ఉంచాలి. రానున్న రోజుల్లో వడదెబ్బలు పెరగనుండటంతో తగు జాగ్రత్తలు పాటించాలి.

చికిత్స ఇలా ...

వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే ప్రాంతానికి మార్చాలి. శరీర ఉష్ణోగ్రత సాదారణ స్థాయికి తీసుకరావడానికి పలుమార్లు కడగాలి. తాగు నీటిని అందుబాటులో ఉంచాలి. వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. వైద్యుల పర్యవేక్షణలో శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంజెక్షన్లు వేయించాలి. రక్తంలోని సైలెన్ ద్వారా గ్లూకోజు, ఎలక్ట్రోలైట్స్ అందిస్తే పశువులు నీర సం నుంచి పశువులు బయటపడతాయి.